# దివ్యక్షేత్రంగా శ్రీగురుపీఠం

- విశ్వయోగి విశ్వంజి మహారాజ్
- వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీగురుపీఠం శిలాన్యాసం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి



విశ్వయోగి విశ్వంజి మహారాజ్ స్వామితో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

శివ్వంపేట, డిసెంబర్ 7 : భవిష్యత్‌లో శ్రీగురుపీఠం దివ్యక్షేత్రంగా మారనున్నదని విశ్వయోగి విశ్వంజి మహారాజ్ స్వామి అన్నారు. మండలంలోని గూడురులో హైకోర్టు సీనియర్ న్యాయవాది, శ్రీదత్తాత్రేయస్వామి, శిర్డీసాయినాథ మందిరాలు (శ్రీగురుపీఠం) నిర్మాణం కోసం గురువారం ఉదయం 8:40 గంటలకు వేద మంత్రోచ్ఛరణల మధ్య శిలాన్యాసం గావించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన పలు ప్రవచనాలు బోధించారు. మానవ పుట్టుక అత్యంత గొప్పదని, సమాజంలో రక్తపాతం, హింసను విస్మరించి ప్రతిఒక్కరూ మనస్సులో శాంతి, జ్ఞానాన్ని నింపుకోవాలన్నారు. విద్యార్థులు దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. గ్రామానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్ తనకు చెందిన 16 గుంటల సొంత భూమిని శ్రీదత్తాత్రేయస్వామి, శిర్డీసాయినాథ మందిరాలను (శ్రీగురపీఠం) నిర్మాణం కోసం కేటాయించడం అభినందనీయమన్నారు. శ్రీదత్తాత్రేయస్వామి, శిర్డీసాయినాథ దేవాలయాలు(శ్రీగురుపీఠం) నిర్మాణం కోసం తమవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యేలు వాకిటి సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. విశ్వయోగి విశ్వంజి మహారాజ్‌కు శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్ రమాదేవి దంపతులు, వేద పండితులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ లక్ష్మి దంపతులు పాదపూజ చేశారు. ప్రత్యేక పూజల అనంతరం విద్యార్థులు, ప్రజాప్రతినిధులు విశ్వయోగి విశ్వంజి మహారాజ్ స్వామి భక్తులకు పలు ప్రవచనాలు బోధించారు. భక్తులకు శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బర్డీపూర్ ఆశ్రమ పీఠాధిపతి దత్తగిరి మహారాజ్, శిర్డీ పండితులు ధర్మాధికారి, మీనాచౌదరి విజయ్‌కుమార్ దంపతులు, వరంగల్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్, జడ్చర్ల డీఎస్పీ రామారావు దంపతులు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీధర్‌గుప్తా, సింగాయపల్లి గోపి, యశోద దవాఖాన డాక్టర్ శ్రీనివాస్, మారెళ్ల మోహన్‌రావు, కూచారం రాంరెడ్డి, ఆకుల ఈశ్వరమ్మ, పబ్బరమేశ్‌గుప్తా, సర్పంచులు స్వరాజ్యలక్ష్మిశ్రీనివాస్‌గౌడ్, పత్రాల శ్రీనివాస్‌గౌడ్, లావణ్యామాధవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీవో భారతి, ఎంపీవో తిరుపతిరెడ్డి, శ్రీగురుపీఠం ట్రస్టుసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రతిభకు 'ఉపకారం'

- ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు భరోసా
- పరీక్ష రాయనున్న 847 మంది విద్యార్థులు
- ఎంపికైతే ఏడాదికి రూ.12 వేల ఉపకారం వేతనం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 7 : పేదరికం చదువుకు ఆటంకం కావొద్దనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తున్నది. 8వ తరగతిలో డ్రాపౌట్స్‌ను నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)తో ప్రోత్సహిస్తున్నది. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తున్నది.

**పరీక్ష విధానం..**

పరీక్ష రెండు భాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటి, రెండోది అప్టిట్యూట్ టెస్ట్ ఇందులో 7, 8వ తరగతి పాఠ్య పుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాలు విభాగాల్లో 90 మార్కుల చొప్పున 180 మార్కులు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. కనీస మార్కులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం కటాఫ్‌గా నిర్ణయించారు. ఎంపిక సమయంలో రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తారు.

**డిసెంబర్ 10న రాత పరీక్ష..**
**జిల్లాలో 5 పరీక్షా కేంద్రాలు..**

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో విద్యార్థులకు ఈ నెల 10న రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల్లో పరీక్ష ఉంటుంది. జిల్లాలో 847 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నడగా మెదక్‌లో 3, నర్సాపూర్, తూప్రాన్‌లో ఒక్కో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు వారి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా ఆన్‌లైన్ https;//bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

# వణుకుతున్న సంగారెడ్డి జిల్లా

- మిగ్‌జాం తుఫాన్‌తో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కోహీర్‌లో అత్యత్పంగా 18.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



సంగారెడ్డి, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా ప్రజలు చలితో వణికిపోతున్నారు. మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి ప్రభావం పెరుగుతున్నది. తుఫాన్ కారణంగా వర్షం తుంపర్లుగా కురుస్తున్నది. చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో చలి తీవ్రత మరింత పెరిగింది.

సంగారెడ్డి జిల్లాలో గురువారం అత్యల్పంగా కోహీర్ మండలంలో 18.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికంగా కల్హేర్‌లో 27 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఝరాసంగంలో 18.4, గుమ్మడిదలలో 18.5, జహీరాబాద్, మొగుడంపల్లిలో 18.6, న్యాల్‌కల్, మునిపల్లి మండలాల్లో 18.7, గుమ్మడిదలలో 18.8, వట్‌పల్లిలో 18.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా అన్ని మండలాల్లో 19 నుంచి 27 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రతతో ప్రజలు చలిమంటలు వేసుకోవడంతోపాటు స్వెట్టర్లు ధరిస్తున్నారు.

**మిగ్‌జాంతో రైతుల్లో ఆందోళన**

మిగ్‌జాం తుఫాన్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షంపు జల్లులు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులు చేయలేకపోతున్నారు. జిల్లాలో వానకాలంలో రైతులు అత్యధిక విస్తీర్ణంలో పత్తిపంటను సాగు చేశారు. చిరుజల్లులతో పత్తి రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. చిరుజల్లులతో ధాన్యం తడిసి తేమశాతం పెరుగుతుందని తద్వారా తమకు ఆశించిన ధర రాదని ఆందోళన చెందుతున్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బొల్లారం క్రీడాకారుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎంపీటీసీ రత్నం

బొల్లారం, డిసెంబర్ 7: రాష్ట్రస్థాయి బుషిడో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలతోపాటు ప్రశంసాపత్రాలు సాధించిన బొల్లారం క్రీడాకారులను మాజీ ఎంపీటీసీ రత్నం అభినందించారు. మున్సిపాలిటీకి చెందిన క్రీడాకారులు యాదగిరి, దీపక్, భాను, బద్రి, రాజ ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. గత నెల 26న సికింద్రాబాద్ వైఎంసీలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఐదుగురు క్రీడాకారులు మార్షల్ ఆర్ట్సులో ప్రతిభ చూపి పతకాలతో పాటుగా ప్రశంసాపత్రాలు సాధించడంపై చిన్ చోటోఖాన్ కరాటే జనరల్ సెక్రటరీ మాస్టర్ పవన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ చాంపియన్ షిప్ పోటీల్లో సురేశ్ 'మాస్టర్ షీల్డ్' సాధించగా, మాస్టర్ పవన్ 'టీం కప్' కైవసం చేసుకున్నారు.



ఢిల్లీలో గవర్నర్ చేతుల మీదుగా మిలినియర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకుంటున్న యువ రైతు ఇంద్రసేనారెడ్డి

# యువ రైతుకు అవార్డు

- చెరుకులో అధిగ దిగుబడిని సాధించిన మామిడ్గి గ్రామ రైతు ఇంద్రసేనారెడ్డి
- మిలినియర్ ఫార్మర్ అఫ్ ఇండియా అవార్డు అందజేసిన ఢిల్లీ గవర్నర్

న్యాల్‌కల్, డిసెంబర్ 7 : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మామిడ్గి గ్రామానికి చెందిన యువరైతు ఇంద్రసేనారెడ్డి చెరుకు పంటలో అధిక దిగుబడులు సాధించాడు. దేశంలోని పలు రాష్ట్రాల్లో వివిధ పంటలు పండించి అధిగ దిగుబడిలు సాధించిన రైతులకు కృషిజాగరణ్ ఆఫ్ అగ్రికల్చర్ వరల్డ్, మహింద్రా ట్రాక్టర్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డికి మిలినియర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డును ఢిల్లీ గవర్నర్ అందజేశారు. మండలంలోని బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాష్ట్ర చెరుకు అభివృద్ధి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, జహీరాబాద్ డీడీఎస్–కేవీకే శాస్రతవేత్త డాక్టర్ రమేశ్ ప్రోత్సహంతో ప్రయోగాత్మంగా మహారాష్ట్ర పూణే వసంత్‌వాడే పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన వీఎస్ఐ 12121 (8005 రకం) చెరుకు వంగడాన్ని ఇంద్రసేనారెడ్డి సాగు చేశాడు. తనకున్న పదెకరాల్లో మొదటిసారిగా డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్ సూచనల మేరకు 6వేల బర్డ్‌చీఫ్ మొక్కలు పొలంలో నాటాడు. శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు పంటను పండించి ఎకరానికి 40టన్నుల దిగుబడి సాధించాడు.

**రైతులను ప్రోత్సహించేందుకు డీడీఎస్-కేవీకే ఎంతో కృషి**

ఏటా అధిగ దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. అందులో భాగంగా జహీరాబాద్ ప్రాంతంలో 35 వేల ఎకరాల్లో రైతులు చెరుకు పంటను సాగు చేస్తున్నారు. సరైన చెరుకు రకం పంటలు లేక రైతులు దిగుబడులు సాధించలేక నష్టపోతున్నారు. దీనికోసం ప్రయోగాత్మంగా మహారాష్ట్ర పూణే వసంత్‌వాడే పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన వీఎస్ఐ 12121 (8005 రకం) చెరుకు వంగడాన్ని ఇంద్రసేనారెడ్డి సాగు చేశారు. తనకున్న పదెకరాల్లో మొదటిసారిగా ఎకర పొలంలో 6వేల బర్డ్ చీఫ్ మొక్కలు నాటి, ఎకరానికి 40టన్నుల దిగుబడి సాధించాడు.

**అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది**

డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తల అందజేసిన వీఎస్ఐ 21121 రకం చెరుకు పంటను సాగుచేశాను. మొదట ఎకరంలో సాగు చేసిన చెరుకు 40టన్నుల మేరకు దిగుబడి వచ్చింది. శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు ఈ సంవత్సరం మరో ఆరెకరాల్లో చెరుకును సాగు చేశాను. ఈసారి ఎకరానికి 60టన్నుల వరకు అధిక దిగుబడి రానున్నది. చెరుకు పంటను పండించేందుకు గ్రామంలో మిగతా రైతులు ఆసక్తి చూపుతున్నారు. నూతనం చెరుకు వంగడాన్ని సాగు చేసి అధిక దిగుబడిని సాధించినందుకు ఢిల్లీకి వెళ్లి ఈ అవార్డును తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. తనకు అవార్డు రావడానికి ఎంతో కృషి చేసిన డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్‌కు కృతజ్ఞతలు.

ఇంద్రసేనారెడ్డి,
యువరైతు, మామిడ్గి, న్యాల్‌కల్

# కేతకీలో కర్ణాటక హైకోర్టు జడ్జి పూజలు



జడ్జికి పూలమాల, శాలువాతో సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

ఝరాసంగం, డిసెంబర్ 7: మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి ఎన్‌కే పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. గురువారం జడ్జి కుటుంబ సభ్యులకు అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో జలలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధికారులు జడ్జికి పూలమాల, శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ అధికారులు రమేశ్, వీరన్న, అర్చకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గొట్టిముక్కుల శివారులో చిరుతపులి సంచారం

పెద్దశంకరంపేట, డిసెంబర్ 7 : మండలంలోని గొట్టిముక్కుల శివారులో చిరుతపులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన తోట యాదయ్య తన పంట పొలంలో పశువులను కట్టివేయగా, గురువారం వేకువజామున చిరుతపులి లేగదూడపై దాడి చేయడంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ ప్రదేశంలో చిరుతపులి పాద ముద్రలు ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ప్రజలు ఎవరూ అటవీప్రాంతంలో తిరగవద్దని సూచించారు. గ్రామంలో చాటింపు వేయించాలని సర్పంచ్ జయశ్రీసూర్యప్రకాశ్‌కు సూచించారు. సాయంత్ర, రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఉదయశ్రీ, అటవీశాఖ సెక్షన్ అధికారి నర్సింహులు, బీట్ అధికారి ప్రవీణ్ ఉన్నారు.



గొట్టిముక్కుల శివారులో లేగదూడను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో వికాస్